పదో తరగతే ఉన్నత విద్యకు కీలకం

- నిర్దిష్ట లక్ష్యంతో సంసిద్ధం కావాలి
- ఆర్‌జేడీ జ్యోతికుమారి
- నడుపూరు జెడ్పీ హైస్కూల్ సందర్శన



పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్జేడీ జ్యోతికుమారి

పెదగంట్యాడ: ప్రతి విద్యార్థికీ పదో తరగతి అత్యంత కీలకమని పాఠశాల విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ జ్యోతికుమారి అన్నారు. భవిష్యత్తుకు పునాది ఇక్కడే వేసుకోవాలని సూచించారు. నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను పరిశీలించి, భవనాల నిర్వహణ తీరుపై ఆరా తీశారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. పదో తరగతి విద్యార్థుల విద్యా స్థాయిని పెంచాలని సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థులను దత్తత తీసుకుని చదివించాలని కోరారు. ఈ ఏడాది పదో తరగతిలో శత శాతం ఉత్తీర్ణత సాధించేలా చూడాలని ఆదేశించారు. పరీక్షలంటే విద్యార్థుల్లో భయం ఉంటుందని, వారిలో అభద్రతా భావం లేకుండా తర్ఫీదు ఇవ్వాలన్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ప్రతీ విద్యార్థి బాగా చదవాలన్నారు. పదో తరగతిలోనే లక్ష్యాలను ఏర్పరుచుకోవాలని సూచించారు.

విద్యాప్రమాణాలు పెంచాలి

ఆర్‌జేడీ జ్యోతికుమారి నడుపూరు ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. విద్యా ప్రమాణాలు పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు. పాఠశాల భవనాలను పరిశీలించారు. విద్యార్థులకు ఇబ్బందులు ఎదురైతే, పక్కనే ఉన్న కమ్యూనిటీ హాలును వినియోగించుకోవాలని సూచించారు. ఆమె వెంట మండల విద్యాశాఖాధికారి పైడపునాయుడు, నడుపూరు హైస్కూల్ హెచ్‌ఎం రాచకొండ శ్రీనివాస్, మంత్రి రాజశేఖర్, మంత్రి గోపీ, మంత్రి శంకరనారాయణ ఉన్నారు. సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ శ్రీనివాసరావు కూడా గురువారం ఉదయం పాఠశాలను సందర్శించారు. విద్యార్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. విద్యార్థుల భద్రతపై అప్రమత్తంగా ఉండాలన్నారు.

క్లుప్తంగా

సంకట మోచన గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు పరిధి నడుపూరులో కొలువుదీరిన సంకట మోచన గణపతి ఆలయంలో సంకట హర చతుర్థిని పురస్కరించుకుని గురువారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. అర్చనలు, అభిషేకాల అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. దంపతులతో కుంకుమ పూజలు చేయించారు. పూజా కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు మంత్రి నర్సింహమూర్తి పర్యవేక్షించారు.

రైల్వే టైంటేబుల్ పత్రాల పంపిణీ

అగనంపూడి: రైళ్ల రాకపోకల వివరాలతో దువ్వాడ రైల్వే స్టేషన్ యూజర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముద్రించిన టైమ్ టేబుల్ పత్రాలను అసోసియేషన్ ప్రతినిధులు గురువారం పంపిణీ చేశారు. దువ్వాడ రైల్వేస్టేషన్, దువ్వాడ, వీఎస్ఈజెడ్, 85, 88 వార్డులోని కాలనీలతో పాటు నగరంలోని వివిధ ప్రాంతాల్లో వీటిని అందజేశారు. దువ్వాడ రైల్వేస్టేషన్‌లో ఆగుతున్న రైళ్లు, రాకపోకల సమయం, వివరాలతో పొందుపరిచిన పాంప్లెట్‌ను పంచిపెట్టినట్లు ప్రతినిధులు కె.ఈశ్వర్, కె.చంద్రరావు తెలిపారు. ప్రయాణికులు, స్థానికులకు ఈ సమాచారం ఉపయోగపడుతుందని భావిస్తున్నామన్నారు. స్టీల్ ఎగ్జిక్యూటివ్ అసోసియేషన్ డైరీలోనూ రైళ్ల రాకపోకల వివరాలను ముద్రించినట్లు వారు తెలిపారు.

ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని వినతి



జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న ఇంటక్ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు రహదారిలో ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరుతూ ఉక్కు భద్రతా విభాగం జీఎం రాత్‌కు స్టీల్ ఇంటక్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఉద్యోగులు ప్రయాణించే రహదారిలో భారీ వాహనాలు ప్రయాణించకుండా స్టీల్ బారికేడ్లు ఏర్పాటు చేయాలని, పశువుల సంచారం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు, కారు రమణ, కొవిరి అవతారం, గొండేశి ప్రభాకరరెడ్డి, ఎస్.ఎ.నాయుడు, గంగవరం గోపి, సాహు, బీఎంకె నాయక్, రమణయ్య, రమణమూర్తి, మంత్రి గోపినారాయణ తదితరులు పాల్గొన్నారు.

శనివాడ శ్మశానవాటిక సమస్యలపై జెడ్సీకి వినతి



జెడ్సీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గాజువాక : అగనంపూడి నిర్వాసిత కాలనీ శనివాడ శ్మశానవాటికలో ప్రహరీ నిర్మించాలని కోరుతూ ముస్లిం నాయకులు జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.ఎం.డి.గౌస్ ఆధ్వర్యంలో జెడ్సీని కలిసిన నాయకులు శ్మశానవాటికలో సౌకర్యాలు కల్పించాలని కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో ముస్లిం నాయకులు షేక్ మీరా, మొహిద్దీన్, అబ్దుల్ రహీం, షేక్ వలీ భాయ్, షేక్ హుస్సేన్ తదితరులున్నారు.

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

గాజువాక : చినగంట్యాడ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని చైతన్యనగర్ ఫీడర్‌కు శుక్రవారం నిర్వహణ పనులను చేపట్టనున్నారు. ఈ కారణంగా చైతన్యనగర్, ఆర్కే ఆస్పత్రి వెనుక భాగం, చిన గంట్యాడలోని కొంత ప్రాంతానికి ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏపీఈపీడీసీఎల్ జోన్–2 ఈఈ బి.కె.నాయుడు తెలిపారు.

728వ రోజుకు ఉక్కు రిలేదీక్షలు



మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకుడు

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం దేశ సంపదను సృష్టించే ప్రయత్నం చేయాలి, కానీ అమ్మకూడదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 728వ రోజు, గురువారం కన్‌స్ట్రక్షన్, ట్రాఫిక్, ఆర్‌ఎండీ విభాగాల కార్మికులు పాల్గొన్నారు. దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి జె.అయోధ్యరామ్, వరసాల శ్రీనివాసరావు, డి.శ్రీనివాస్, సీహెచ్ సన్యాసిరావు, అప్పలరాజు, గుమ్మడి నరేంద్ర తదితరులు ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రైవేటీకరణ కుట్రలో భాగంగా యాజమాన్యం ఉక్కు ఉత్పత్తుల తయారీకి కావలసిన ముడి సరుకులను సమకూర్చడంలో ఉదాసీనంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. రోజుకో విభాగంలో ఉత్పత్తిని నిలిపివేస్తూ కొన్ని విభాగాలను ప్రైవేటు వారికి కట్టబెట్టాలని ప్రయత్నం చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. కేంద్ర ప్రభుత్వ తీరు మారాలన్నారు. ప్రజా ఉద్యమాలకు ఎంత పెద్ద నియంతైనా తలవంచక తప్పదన్నారు. కేంద్ర ప్రభుత్వం తీరును మార్చుకుని స్టీల్ ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో హరనాథ్, ఈశ్వరరావు, అప్పారావు, శ్రీనివాసరావు, అశోక్, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

వార్డులో సమస్యల పరిశీలన



పారిశుధ్య నిర్వహణ తీరును పరిశీలిస్తున్న కార్పొరేటర్ నర్సింహపాత్రుడు

పెదగంట్యాడ: వార్డు పరిధిలోని అన్ని ప్రాంతాలను సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు అన్నారు. వార్డు పరిధిలోని పలు ప్రాంతాలను గురువారం ఆయన పరిశీలించారు. బాపూజీ కాలనీ ప్రజలను సమస్యలడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడి పాఠశాలలో చేపట్టిన నాడు–నేడు పనుల పురోగతిపై ఆరా తీశారు. తడి–పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్య సమాజం కోసం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇళ్లలోని చెత్తను పారిశుధ్య సిబ్బందికి అందజేయాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, లోకనాథం, మంగునాయుడు, ఎల్వీ రమణ, శ్రీరామ్మూర్తి రాజు, చంటిరాజు, బాబ్జీ, రామకృష్ణ, కృష్ణ, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

గర్భిణుల్లో హెచ్‌ఐవీ స్థాయి గుర్తింపునకు సర్వే



గణాంకాలను పరిశీలిస్తున్న ఏపీవో కామేశ్వరరావు

అగనంపూడి: గర్భిణుల్లో హెచ్‌ఐవీ స్థాయి, శాతాన్ని గుర్తించేందుకు హెచ్‌ఐవీ సెంటినల్ సర్వేలెన్స్ (హెచ్ఎస్ఎస్) నిర్వహిస్తున్నట్టు ఐసీటీసీ అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ వై.కామేశ్వరరావు అన్నారు. అగనంపూడి ఐసీటీసీ (ఇంటిగ్రేటెడ్ కౌన్సిలింగ్ టెస్టింగ్ సెంటర్)లో ఈ నెల 2వ తేదీ నుంచి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. సర్వే తీరును పరిశీలించేందుకు అగనంపూడి ఆస్పత్రికి విచ్చేసిన ఆయన మాట్లాడుతూ హెచ్‌ఐవీ శాతం గుర్తించడం ద్వారా గతానికి ఇప్పుడు ఉన్న వ్యత్యాసాన్ని బేరీజు వేసుకుని తీసుకోవల్సిన చర్యల గుర్తించి చర్చిస్తామన్నారు. గర్భ నిర్ధారణకు వచ్చే సమయంలో మహిళలకు ఈ పరీక్షలు నిర్వహించడం ద్వారా హెచ్‌ఐవీ వ్యాప్తి, తగ్గుదల వంటి వాటిని గుర్తించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీఐఎస్ బద్రీ, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.ఉష, ఆర్‌ఎంవో గోపాలకృష్ణ, ఐసీటీసీ కౌన్సెలర్ ఎం.వి.రవికుమార్, ఎల్‌టీ కె.కళావతి తదితరులు పాల్గొన్నారు.

గంగవరం పోర్టు రోడ్డు అభివృద్ధి పనులకు భూమిపూజ



భూమి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక : అదాని గంగవరం పోర్టు రోడ్డు అభివృద్ధి పనులకు గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి గురువారం భూమిపూజ చేశారు. స్వతంత్రనగర్ దరి వై జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డును అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కోటి రూపాయల నిధులతో రోడ్డు అభివృద్ధి పనులను ప్రారంభించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో అదానీ గంగవరం పోర్టు సీఈవో బి.జి.గాంధీ, అధికారులు దేవేందర్ టక్కర్, నందూరి సాంబశివరావు, అనిల్ బాలకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మాధవ్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తున్నానని ఎమ్మెల్సీ పి.వి.ఎన్. మాధవ్ అన్నారు. ఉక్కునగరం బీఎంఎస్ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటు పరం కాకుండా సెయిల్‌లో గాని, ఎన్ఎండీసీలో గాని విలీనం చేసేలా ప్రయత్నిస్తున్నామన్నారు. ఉక్కు అధికారులు, కార్మికుల వేతన ఒప్పందం, అధికారుల పదోన్నతుల అంశాలపై పరిష్కారానికి ప్రయత్నిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. అంతకు ముందు కేంద్ర ఉక్కు అదనపు కార్యదర్శి రుచికా చౌదరి గోయల్, స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్, డైరెక్టర్ (ఫైనాన్స్) వి.వి. వేణుగోపాలరావు, స్టీల్‌ప్లాంట్ ఇండిపెండెంట్ డైరెక్టర్ ఘన్ శ్యామ్ సింగ్‌లను కలిసి వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెన్నా శ్రీరామ్మూర్తి, కృష్ణంరాజు, శ్రీనివాసరావు, బీఎంఎస్ నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి బీజేపీ మండల సమావేశాలు

గాజువాక : గాజువాక నియోజకవర్గంలో బీజేపీ మండల సమావేశాలు శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ గాజువాక కో–ఆర్డినేటర్ కరణంరెడ్డి నర్సింగరావు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన పద్ధతులపై ఈ సమావేశాల్లో చర్చిస్తామని తెలిపారు.

క్షణక్షణం.. భయం భయం

- వాహనం ఢీకొనడంతో విరిగిన విద్యుత్ స్తంభం
- ఏ క్షణాన్నయినా కూలే ప్రమాదం

అగనంపూడి: అగనంపూడి కూడలి జాతీయ రహదారిపై విద్యుత్ స్తంభం విరిగిపోయి, ప్రమాదకర స్థితిలో ఉంది. వారం రోజుల క్రితం అగనంపూడి ప్రధాన రహదారి కూడలిలో (ఎస్‌బీఐకి ఎదురుగా) గుర్తు తెలియని వాహనం ఈ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో స్తంభం విరిగిపోయి, ఓ పక్కకు ఒరిగింది. ఎప్పుడు నేలకొరిగినా పెను ప్రమాదం తప్పదని, స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ కూడలిలో నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. వేలాది మంది రాకపోకలు సాగిస్తూ ఉంటారు. ఈ క్రమంలో గాలి వాటానికి ఊగుతున్న స్తంభాన్ని చూసి స్థానికులు, ప్రయాణికులు హడలిపోతున్నారు. అటుగా వెళ్లాలంటేనే భయపడుతున్నారు. ప్రజల సంచారం ఎక్కువగా ఉన్న సమయంలో కూలిపోతే ప్రమాదం అంచనా వేయలేమని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఆర్‌ఈసీఎస్, జీవీఎంసీ అధికారులు స్పందించి తక్షణం విద్యుత్ స్తంభాన్ని తొలగించి, కొత్తది అమర్చాలని కోరుతున్నారు.



ప్రమాదకర స్థితిలో ఉన్న విద్యుత్ స్తంభం (ఇన్‌సెట్) స్తంభం విరిగిన భాగం

మోడల్ స్లమ్ స్కీంకు 55వ వార్డు ఎంపిక

కంచరపాలెం: మురికివాడల అభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న మోడల్ స్లమ్ స్కీంలో 55వ వార్డును ఎంపిక చేసినట్లు జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు తెలిపారు. వార్డులోని కంచరపాలెం పరిధి ధర్మానగర్, తిక్కవానిపాలెం ప్రాంతాల్లో గురువారం నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజుతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా కె.కె. రాజు మాట్లాడుతూ మోడల్ స్లమ్ స్కీంలో డ్రైనేజీలు, కాలువల మరమ్మతులు, శ్మశానవాటికలు, సామాజిక భవన నిర్మాణాలు దశల వారీగా అభివృద్ధి చేస్తామని తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై వెనక్కి తగ్గాలి



మాట్లాడుతున్న లోకనాథం

మద్దిలపాలెం: లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కోట్లాది రూపాయలు పన్నులు చెల్లిస్తున్న విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.లోకనాథం డిమాండ్ చేశారు. పిఠాపురం కాలనీలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ విక్రయానికి ఒక ఏజెంట్‌గా బీజేపీ ఎంపీ జీవీఎల్ నర్సింహారావు వ్యవహరించడాన్ని మానుకోవాలని హితవు పలికారు. ఉత్తరాంధ్రపై అమితమైన ప్రేమ ఉన్నట్టు జీవీఎల్ వ్యవహరించడం అనుమానాస్పదంగా ఉందన్నారు. స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయింపుపై ఏనాడు చర్చించలేదన్నారు. కావాలనే స్టీల్‌ప్లాంట్ నష్టాలను చూపిస్తున్నారని ఆరోపించారు. ప్లాంట్ ఏర్పాటు చేసినప్పుడు కేంద్ర ప్రభుత్వం పెట్టుబడి కేవలం రూ.5వేల కోట్లు అని, పన్నుల రూపంలో ఇప్పటి వరకూ రూ.52 వేల కోట్లు అందుకున్న విషయాన్ని దాచిపెడుతున్నారన్నారు. ఎంపీ జీవీఎల్ స్టీల్‌ప్లాంట్‌పై సవతి ప్రేమ చూపిస్తూ దాన్ని నష్టాలను భర్తీ చేసుకోవడానికి హెచ్‌బీ కాలనీలోని స్టీల్ ప్లాంట్ క్వార్టర్లు ఉన్న 20 ఎకరాల భూమిని ప్రైవేటు వ్యక్తులు ఇవ్వాలని సూచించడం సమంజసంగా లేదన్నారు. అదాని, అంబానీలకు లక్షల కోట్లు రాయితీలు ఇస్తున్న కేంద్రం.. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు రూ.6వేల కోట్లు ఇవ్వడానికి ఎందుకు వెనుకడుగు వేస్తుందని ఆయన ప్రశ్నించారు. సమావేశంలో పార్టీ నగర కార్యదర్శి జగ్గునాయుడు, కార్యవర్గ సభ్యుడు ఆర్కే ఎస్వీ కుమార్ పాల్గొన్నారు.

థాంక్స్ టు సాక్షి – వీధి దీపాలు వెలిగాయి



కాళింగవీధిలో వెలుగుతున్న వీధి దీపాలు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు పరిధి వడ్లపూడి కాళింగవీధిలో వీధి దీపాలు వెలిగాయి. ఈ ప్రాంతంలో వీధి దీపాలు సరిగ్గా వెలగక స్థానికులు ఇబ్బంది పడేవారు. ఈ సమస్యపై ఈ నెల 7వ తేదీన సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. వీధి దీపాలకు సిబ్బందితో గురువారం మరమ్మతులు చేయించి, వినియోగంలోకి తెచ్చారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

‘గడప గడప’లో సాదర స్వాగతం



విద్యా దీవెన ద్వారా లబ్ధి పొందిన విద్యార్థినికి సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

అక్కిరెడ్డిపాలెం: రాష్ట్రంలో 90 శాతానికి పైగా ప్రజలు జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనను కోరుకుంటున్నారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 69వ వార్డు నాతయ్యపాలెం సచివాలయం–2 పరిధిలో గురువారం సాయంత్రం ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిదారులను కలిశారు. ప్రతీ ఇంటి వద్ద ఎమ్మెల్యేకు సాదర స్వాగతం లభించింది. విద్యా దీవెన ద్వారా పొందిన ఓ విద్యార్థినికి సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడంతో పేద విద్యార్థులు ఉన్నత విద్యను పొందడానికి అవకాశాలు మెరుగవుతున్నాయన్నారు. జగన్ పాలన చూసి ప్రపంచ మేధావులు ప్రశంసిస్తున్నారన్నారు.

ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఆయన దృష్టికి రాగా, వెంటనే సంబంధిత సచివాలయ సిబ్బందితో మాట్లాడి, సమస్యల పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు బోగాది సన్యాసిరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్ రెడ్డి, నాయకులు ఈగల పాటి యువశ్రీ, కమరున్నీసా బేగం, మళ్ల కుమార్, పాతిన బాలు, శివకుమార్, గోపిశెట్టి మధు, గంట్రెడ్డి శంకర్, గోపిశెట్టి పరమేష్, సంగ్రాన చినసన్యాసిరావు, పలు విభాగాల అధికారులు, సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణతో స్వయం ఉపాధి



కుట్టు మిషన్లు అందుకున్న మహిళలతో రోటరీ ఫౌండేషన్, జనశిక్షణ సంస్థాన్, పోవా ప్రతినిధులు

- రోటరీ ఫౌండేషన్ పూర్వ గవర్నర్ జగదీశ్వరరావు
- మహిళలకు 3 నెలల శిక్షణ పూర్తి
- 47మందికి కుట్టుమిషన్ల పంపిణీ

అక్కిరెడ్డిపాలెం: కుట్టు శిక్షణ ద్వారా మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని ప్రోగ్రామ్ ఇన్‌చార్జి, రోటరీ ఫౌండేషన్ పూర్వ గవర్నర్ ఎం.జగదీశ్వరరావు అన్నారు. వారు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఇది తోడ్పడుతుందన్నారు. వృత్తి విద్యలో భాగంగా గ్లోబల్ గ్రాండ్ ద్వారా రోటరీ ఫౌండేషన్ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో 47 మంది పేద మహిళలకు 3 నెలల పాటు కుట్టు పనిలో శిక్షణ ఇచ్చారు. అనంతరం వారికి అక్కిరెడ్డిపాలెం వద్ద గల పంచవటీలో రోటరీ ఫౌండేషన్, జనశిక్షణ సంస్థాన్ ప్రతినిధుల చేతుల మీదుగా సర్టిఫికెట్లతో పాటు మోటారుతో కూడిన కుట్టు మిషన్లను అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో జగదీశ్వరరావు మాట్లాడుతూ విశాఖపట్నంలో 6 సెంటర్లలో 12 షిఫ్టులుగా 261 మందికి 3 నెలల పాటు జనశిక్షణ సంస్థాన్ శిక్షకులతో కుట్టు పనిలో శిక్షణ ఇచ్చామని చెప్పారు. రోటరీ ఫౌండేషన్ పూర్వ గవర్నర్ డాక్టర్ డి.వి.ఆర్.పోషా మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు కుట్టు మిషన్లతో పాటు బ్యాంకు రుణాలు పొందే అవకాశాన్ని కల్పించి, ఉపాధి పొందేవిధంగా సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. మహిళలకు అవుట్‌సోర్సింగ్‌లో ఉపాధి పొందే అవకాశం కల్పించబడిందని, తద్వారా నెలకు రూ.10 వేల నుంచి 15 వేల వరకు ఆదాయం పొందే అవకాశం ఉందని తెలిపారు. శిక్షకురాలు జగదీశ్వరిని ప్రశంసించారు. కార్యక్రమంలో జనశిక్షణ సంస్థాన్ చైర్మన్ సీహెచ్.రామరాజు, డైరెక్టర్ సీహెచ్.అప్పలనాయుడు, పంచవటి హౌస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పోవా) అధ్యక్షుడు చిన్నారావు, కార్యదర్శి రామ్మోహనరావు, అగ్నికుల క్షత్రియ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అప్పలరాజు, కార్యదర్శి అంగ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పసి గుండె పదిలంగా..

- చిన్నారుల గుండె సమస్యలపై అవగాహన

అక్కిరెడ్డిపాలెం: పెద్దవారిలో గుండె సమస్యలు రావటం పరిపాటి. కానీ, ప్రస్తుత కాలంలో పుట్టుకతోనే గుండె సమస్యలతో జన్మిస్తున్న చిన్నారుల సంఖ్య పెరగడం ఆందోళనకు దారితీస్తోంది. ఈ సమస్యను అధిగమించాలంటే అవగాహన, చికిత్సలతోనే సాధ్యమవుతుందంటున్నారు షీలానగర్ కిమ్స్ ఐకాన్‌కు చెందిన చిన్న పిల్లల గుండె వైద్య నిపుణురాలు డాక్టర్ శాంతిప్రియ. చిన్నపిల్లల్లో వచ్చే గుండె సమస్యలపై అవగాహన కల్పించేందుకు ఈ నెల 7 నుంచి 14వ తేదీ వరకు నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా, గురువారం ఆమె ఈ అంశంపై పలు విషయాలను వెల్లడించారు. మన దేశంలో పుట్టుకతోనే గుండె జబ్బుతో జన్మించే పిల్లల సంఖ్య ఏటా 2లక్షల కంటే ఎక్కువగానే ఉంటోందన్నారు. ఆ చిన్నారులు పాలు సరిగ్గా తాగలేరని, తరచూ ఆయాసం, న్యుమోనియా బారిన పడతారని తెలిపారు. తల్లి 18వారాల గర్భంతో ఉన్నప్పుడే చిన్నారుల్లో గుండె లోపాలను గుర్తించవచ్చని తెలియజేశారు. వారిలో 60శాతం మందిలో గుండెల్లో ఏర్పడిన రంధ్రాలు వాటికవే మూసుకుపోతాయని, వారికి శస్త్రచికిత్స అవసరం లేదని చెప్పారు. గుండె లోపాలతో పుట్టిన 20 శాతం మందికి పుట్టిన నెలలోపే శస్త్రచికిత్స అవసరం ఉంటుందన్నారు. 30 శాతం సమస్యలను గొట్టం సాయంతో చేసే శస్త్రచికిత్సలతో సరి చేయవచ్చని, ఇందులో ఎలాంటి మచ్చ ఏర్పడకుండా పిల్లలు త్వరగా కోలుకుంటారని వివరించారు.

12న రక్తదాన శిబిరం



ఉక్కు హిల్‌టాప్ కూడలి వద్ద ప్రచారం చేస్తున్న సత్యసాయి, జేసీఐ ప్రతినిధులు

ఉక్కునగరం: స్థానిక సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఫిబ్రవరి 12, ఆదివారం నిర్వహించనున్న రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని సత్యసాయి రక్తదాన కో–ఆర్డినేటర్ రామాంజనేయ రాజు కోరారు. ఉక్కు హిల్‌టాప్ కూడలి వద్ద రక్తదాన శిబిరం నిర్వహణపై గురువారం ప్రచారం చేశారు. ఇప్పటి వరకు ఉక్కునగరం సత్యసాయి సమితి ఆధ్వర్యంలో 33 రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి, ఆపదలో ఉన్నవారికి రక్తాన్ని అందజేస్తున్నారన్నారు. ప్రతీ ఒక్కరూ రక్తదానం చేయడం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారిని ఆదుకోవచ్చన్నారు. వైజాగ్ స్టీల్ సిటీ సహకారంతో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు పాల్గోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్. రవికుమార్, విష్ణుమూర్తి, రంగరాజు, సంతోష్ కుమార్, బలిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రంగా డంపింగ్ యార్డ్

సాక్షి ఎఫెక్ట్..



చెత్తను తరలించడంతో పరిశుభ్రంగా ఉన్న డంపింగ్ యార్డ్

పెదగంట్యాడ: డంపింగ్ యార్డ్ పరిశుభ్రంగా మారింది. ఎప్పటికప్పుడు ఇక్కడి చెత్తాచెదారాన్ని తరలిస్తున్నారు. గతంలో ఈ యార్డ్‌లో కుప్పలుతెప్పలుగా చెత్తాచెదారం పేరుకుపోయేది. రోజు వారీ చెత్తను తరలించకుండా నిర్లక్ష్యంగా వదిలేయడంతో చెత్త మొత్తం కొండలా కనిపించేది. దుర్వాసనతో, దోమలతో స్థానికులు ఇబ్బంది పడేవారు. చెత్తను తరలించడంలో ‘రాషా ఇన్‌ఫ్రా’ నిర్లక్ష్యంగా వ్యవహరించడం, జీవీఎంసీ అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఆ సంస్థ వారు వాహనాల నిర్వహణలోనూ నిర్లక్ష్యంగా వ్యవహరించేవారు. దీంతో అవి కాస్తా మొరాయించడంతో చెత్త తరలింపులో ట్రిప్పుల సంఖ్య కూడా తగ్గిపోయేది. ఈ నేపథ్యంలో ఈ నెల 4న ‘సాక్షి’ దినపత్రికలో ‘రాషా’లీలలు శీర్షికన కథనం ప్రచురితం కావడంతో ఏఎంహెచ్‌వో డాక్టర్ కిరణ్‌కుమార్ స్పందించారు. గుట్టలుగా పేరుకుపోయిన చెత్తను దగ్గరుండి తరలించేశారు. రోజుకు 40 నుంచి 50 ట్రిప్పులతో చెత్తను తరలించడంతో డంపింగ్ యార్డ్ ఇప్పుడు శుభ్రంగా కనిపిస్తోంది. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏఎంహెచ్‌వో డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఏ రోజు చెత్త ఆ రోజే తరలించేలా చర్యలు చేపట్టామని తెలిపారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూస్తామని చెప్పారు.